క్లుప్తంగా

సాగర తీరాన్ని సందర్శించిన అవనిగడ్డ న్యాయమూర్తి



కోడూరు: హంసలదీవి సాగరతీరాన్ని అవనిగడ్డ కోర్టు జ్యుడీషియల్ ఫస్ట్ క్లాస్ మేజిస్ట్రేట్ లంకా గోపీనాథ్ ఆదివారం సందర్శించారు. ప్రత్యేక వాహనంలో తీరానికి చేరుకున్న ఆయనకు పాలకాయతిప్ప మెరైన్ పోలీసులు స్వాగతం పలికారు. కృష్ణమ్మ సాగరుడిని కలిసే పవిత్ర కృష్ణా సాగర సంగమ ప్రాంత విశిష్టతను న్యాయమూర్తికి వివరించారు.

కార్తికేయుని ఆలయంలో భక్తుల రద్దీ



మోపిదేవి: మోపిదేవి వల్లీదేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి ఆలయం ఆదివారం భక్తులతో కోలాహలంగా మారింది. తెల్లవారుజాము నుంచే వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో క్యూ లైన్లు అన్నీ నిండిపోయాయి. ఆలయ ప్రాంగణం భక్తులతో కిటకిటలాడింది. నాగపుట్ట, నాగమల్లి వృక్షం, పొంగళ్లశాల వద్ద భక్తుల రద్దీ ఏర్పడింది. ఆలయ ఏసీ ఎన్ఎస్ చక్రధరరావు ఆధ్వర్యంలో ఆలయ సూపరింటెండెంట్ బొప్పన సత్యనారాయణ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

చేవేంద్ర పీహెచ్‌సీ డాక్టర్ వరప్రసాద్ బదిలీ

పెడన: చేవేంద్ర పీహెచ్‌సీలో ఆరేళ్ల పాటు సేవలందించిన డాక్టర్ ఎం. వరప్రసాద్ బదిలీ అయ్యారు. ఈయన స్థానంలో అల్లూరి సీతారామరాజు జిల్లా గంగవరం నుంచి డాక్టర్ అనూష బదిలీపై రానున్నారు. డాక్టర్ వరప్రసాద్ పామర్రు మండలం జమీగొల్వేపల్లికి బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఆస్పత్రిలో సెకండ్ డాక్టర్ ప్రదీప్ వైద్య సేవలు అందిస్తున్నారు. ఇదే ఆస్పత్రిలో పనిచేస్తున్న సీనియర్ అసిస్టెంట్ శివకుమారి మచిలీపట్నం డీఎంహెచ్ఓ కార్యాలయానికి, ఎంపీఈహెచ్ఓ ఉమామహేశ్వరరావు ఏలూరు జిల్లా గుడివాకలంకకు బదిలీ అయ్యారు. సూపర్వైజర్‌గా ముదినేపల్లి పీహెచ్‌సీ నుంచి ప్రభాకర్ బదిలీపై వచ్చి విధుల్లో చేరారు.

ఘనంగా గంగానమ్మ తల్లి నెల సంబరం



నాగాయలంక: గ్రామంలోని తలశిల వంశీయుల ఇలవేల్పు గంగానమ్మ తల్లి నెల సంబరం ఆదివారం ఘనంగా జరిగింది. తొలుత కమిటీ ప్రతినిధులు, రజక పూజారుల నేతృత్వంలో కృష్ణానది నుంచి తలశిలవారి ఆడపడుచులు, కోడళ్లు బిందెలతో నదీ జలం తీసుకుని ఊరేగింపుగా వచ్చి అమ్మవారికి అభిషేకం జరిపారు. వేప మండలు, నిమ్మకాయలతో గంగానమ్మను అలంకరించారు. ఆలయ ఆవరణలో హోమం నిర్వహించారు. తలశిల స్వర్ణలత, ఉప్పల శివరంజని, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వృద్ధులకు వస్త్రదానం



చిలకలపూడి(మచిలీపట్నం): విజయవాడకు చెందిన రావి సురేష్‌బాబు, గుమ్మడి ప్రసాద్, మండవ ఉషారాణి ఆధ్వర్యంలో స్థానిక వాసవీ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు ఆదివారం వైద్య పరీక్షలు నిర్వహించారు. అనంతరం వృద్ధులకు పండ్లు, బట్టలు పంపిణీ చేసి ఆర్థిక సాయం చేశారు. వృద్ధులతో కొద్దిసేపు ముచ్చటించిన అనంతరం అన్నదానం చేశారు. వారు మాట్లాడుతూ తమ సేవా కార్యక్రమాలను వివరించారు. దాతలకు వృద్ధాశ్రమం కమిటీ సభ్యులు పి. మల్లికార్జునరావు, ఉడత్తు శ్రీనివాసరావు, కె. రాజేంద్రప్రసాద్, కె. నరేష్‌కుమార్ కృతజ్ఞతలు తెలిపారు.

నేటి నుంచి మచిలీపట్నం-రేపల్లె బస్ సర్వీస్

మచిలీపట్నం టౌన్: ప్రయాణికుల కోరిక మేరకు మచిలీపట్నం నుంచి రేపల్లెకు పల్లె వెలుగు బస్సు సర్వీసును సోమవారం నుంచి పునరుద్ధరించామని స్థానిక ఆర్టీసీ డిపో మేనేజర్ టి. పెద్దిరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సర్వీసు మచిలీపట్నం డిపో నుంచి ప్రతి రోజూ ఉదయం 7.10 గంటలకు, 11.10 గంటలకు, సాయంత్రం 5.10 గంటలకు బయలుదేరుతుందన్నారు. అలాగే రేపల్లె నుంచి ఉదయం 9.15 గంటలకు, మధ్యాహ్నం 1.10 గంటలకు, ఐదు గంటలకు పల్లె వెలుగు సర్వీసు మచిలీపట్నంకు బయలు దేరుతుందని వివరించారు. మచిలీపట్నం, రేపల్లె ప్రాంతాల ప్రయాణికులు వినియోగించు కోవాలని కోరారు.

వైద్య సేవలు మరింత చేరువ

- రూ.95 లక్షలతో యూపీహెచ్‌సీ భవన నిర్మాణం
- అందుబాటులోకి వైద్య సేవలు
- 60కి పైగా వైద్య పరీక్షలు.. పెరిగిన ఓపీ
- రోగులకు ఉచితంగా మందుల పంపిణీ





పెడన యూపీహెచ్‌సీ నూతన భవనం (ఇన్‌సెట్) ల్యాబ్‌లో అత్యాధునిక పరికరాలు

పెడన: పట్టణానికి మణిహారంగా పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్) ప్రారంభం కావడంతో పట్టణ ప్రజలకు వైద్య సేవలు మరింత చేరువయ్యాయి. రూ.95 లక్షలతో యూపీహెచ్‌సీ భవనాన్ని నిర్మించారు. పట్టణంలోని 35 వేలకు పైగా ఉన్న జనాభాకు పది మంది ఏఎన్ఎంలు, 20 మంది ఆశా వర్కర్లు వైద్య సేవలను క్షేత్రస్థాయిలో అందజేస్తున్నారు. వీరు ఇళ్ల వద్ద చూస్తూ అవసరం మేరకు యూపీహెచ్‌సీకి సిఫార్సు చేస్తుంటారు. నేరుగా యూపీహెచ్‌సీకి వస్తున్న వారు కూడా ఉండటంతో వీరి సంఖ్య ఇటీవల బాగా పెరిగింది.

ఆపరేషన్ థియేటర్‌తోపాటు ఇద్దరు వైద్యులు

గతంలో అద్దె భవనంలో కొనసాగుతూ కొన్ని వార్డులకు మాత్రమే పరిమితమైన యూపీహెచ్‌సీ తాజాగా నూతన భవనం నిర్మాణంతో పాటు ఆధునిక పరికరాలు పూర్తిస్థాయిలో సమకూరాయి. సిబ్బంది కూడా పూర్తి స్థాయిలో అందుబాటులోకి వచ్చారు. యూపీహెచ్‌సీలో ఆపరేషన్ థియేటర్‌తో పాటు ఇద్దరు వైద్యులు ఉండేలా చర్యలు తీసుకున్నారు. ఒకరు రెగ్యులర్ వైద్యులు కాగా మరొకరు వారానికి ఒక ప్రత్యేక వైద్య నిపుణుల ద్వారా ప్రజలకు సేవలు అందించేలా ప్రణాళికలు అమలు చేయనున్నారు. ఏ వారం ఏ వైద్య నిపుణులు వస్తారనే దానిపై త్వరలోనే స్పష్టత వస్తుంది. ఫార్మసిస్ట్, స్టాఫ్ నర్సు, నర్సు, ల్యాబ్ టెక్నీషియన్, అటెండరు ప్రస్తుతం యూపీహెచ్‌సీలో అందుబాటులో ఉన్నారు.

200 రకాలకు పైగా మందులు..

ఈ ఆస్పత్రిలో 170కి పైగా వివిధ రకాల మందులు, ఆయింట్‌మెంట్లు అందుబాటులో ఉన్నాయి. అలాగే సర్జికల్ (శస్త్రచికిత్స)కు సంబంధించి 70కి పైగా మందులు ఉచితంగా ఇస్తున్నాయి. వెరసి మొత్తం రెండు వందలకు పైగా వివిధ రకాల మందులను రోగులకు వారి వ్యాధులను బట్టి సిఫార్సు చేస్తూ ఉచితంగా అందజేస్తున్నారు.

60కి పైగా వైద్య పరీక్షలు..

యూపీహెచ్‌సీలో ప్రత్యేకంగా ల్యాబ్‌లో అత్యాధునిక పరికరాలను ఏర్పాటు చేశారు. సుమారు 60కి పైగా వైద్య పరీక్షలు చేస్తున్నారు. రక్త నమూనా ద్వారా 20 పరీక్షలు సీబీపీ (కంప్లీట్ బ్లడ్ పిక్చర్) పరీక్షలు అందుబాటులో ఉన్నాయి. లివర్, కిడ్నీ, గుండె సంబంధిత పరీక్షలు కూడా చేస్తున్నారు. యూరిన్ టెస్ట్ 15 రకాలు, థైరాయిడ్, సీరమ్ క్రియాటిన్, సోడియం లెవల్స్ వంటి పరీక్షలు కూడా అందుబాటులో ఉన్నాయి.

అప్పటికప్పుడే రిపోర్టులు



ల్యాబ్‌లో నిర్వహించే పరీక్షలు సుమారు 64 వరకు ఉన్నాయి. వీటిల్లో కొన్ని పరీక్షలకు అప్పటి కప్పుడే రిపోర్టులు ఇస్తున్నాము. రిపోర్టులు రావడానికి గంట నుంచి రెండు, మూడు రోజులు సమయం పట్టేవి కూడా ఉన్నాయి. ఈ విషయాన్ని ల్యాబ్‌కు వచ్చిన రోగులకు స్పష్టంగా తెలియజేస్తున్నాం.

– గోపీకృష్ణ, ల్యాబ్ టెక్నీషియన్, యూపీహెచ్‌సీ, పెడన

ఓపీ పెరుగుతుంది



ప్రస్తుతం నూతన భవనంలో వైద్య సేవలు ప్రారంభించాం. గతంలో ఓపీ రోజుకు 20లోపు ఉండేది. ప్రస్తుతం 40 వరకు పెరిగింది. ప్రస్తుతం రెగ్యులర్ డాక్టర్ మాత్రమే వైద్య సేవలు అందిస్తున్నారు. ప్రత్యేకంగా నిపుణులు వచ్చే అవకాశాలు ఉన్నాయి. నేత్ర వైద్య నిపుణులు, గైనిక్, షుగర్ ఇలా వైద్య నిపుణులు వచ్చి సేవలు అందించేలా ప్రత్యేకంగా మరో వైద్యాధికారి గది కూడా ఉంది.

– డాక్టర్ అఖిలేష్, వైద్యాధికారి, యూపీహెచ్‌సీ, పెడన

ఏఎస్‌ఐ ఆంజనేయులుకు సత్కారం



ఆంజనేయులును సత్కరిస్తున్న డీఎస్పీ, సీఐ, ఎస్‌ఐ

కోడూరు: విధి నిర్వహణలో అంకితభావంతో పని చేస్తూ కోడూరు ఏఎస్‌ఐ ఆంజనేయులు ఆదర్శంగా నిలుస్తున్నారని అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్ అన్నారు. ఆదివారం స్థానిక స్టేషన్ వద్ద ఏఎస్‌ఐని పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. 2019 నుంచి కోడూరు స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ఆంజనేయులు ఎలాంటి బాధ్యతలు అప్పగించినా తక్షణమే పూర్తి చేస్తారని డీఎస్పీ అన్నారు. ఆంజనేయులు ఉద్యోగ బాధ్యతలతోపాటు సేవా కార్యక్రమాలు చేయడంలో ముందుండటం హర్షణీయమన్నారు. అనాథలు, వృద్ధులు, ప్రమాద బాధితులకు తనవంతు సహాయం అందిస్తూ ఇతరులకు ఆదర్శంగా నిలుస్తున్నారని ప్రశంసించారు. అనంతరం ఆంజనేయులుకు బొకే అందించి దుశ్శాలువాలతో సత్కరించారు. అవనిగడ్డ సీఐ జి.శ్రీనివాస్, ఎస్‌ఐ రాజేంద్రప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు వేణుగోపాలుడి భూముల కౌలు వేలం

కోడూరు: హంసలసదీవి రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి వారి దేవాలయ భూములకు సంబంధించి ఈ నెల 27న కౌలు వేలం నిర్వహిస్తామని ఆలయ ఈఓ సీహెచ్ సుధాకరరావు ఆదివారం తెలిపారు. హంసలదీవి గ్రామంలోని 29.57 ఎకరాల చెరువులతో పాటు 7.04 ఎకరాల మెట్ట భూమికి సంబంధించి కౌలు వేలం ఉదయం 10 గంటలకు ఆలయ ప్రాంగణం వద్ద జరుగుతాయని చెప్పారు. మూడేళ్ల కాల పరిమితితో భూములను కౌలుకు ఇస్తామని వివరించారు. ఆసక్తిగల రైతులు ధరావతు చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

28న గోకర్ణేశ్వరుడి భూములకు కౌలు వేలం..

లింగారెడ్డిపాలెంలోని బాలాత్రిపుర సుందరీ సమేత గోకర్ణేశ్వర స్వామి వారి ఆలయ భూములకు సంబంధించి ఈ నెల 28న కౌలు వేలం నిర్వహిస్తామని ఈఓ సుధాకర్ తెలిపారు. నక్కవానిదారి, ఇస్మాయిల్‌బేగ్‌పేట, జయపురం, లింగారెడ్డిపాలెం గ్రామాల్లోని 21.02 ఎకరాల భూమికి వేలం జరుగుతుందని వివరించారు.


కొల్లూరి సత్యనారాయణకు డాక్టరేట్



సత్యనారాయణకు గౌరవ డాక్టరేట్‌ను అందజేస్తున్న యూనివర్సల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ ప్రతినిధులు

పెడన: యూనివర్సల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ అండర్ నీతి అయోగ్ గవర్నమెంటు ఆఫ్ ఇండియా వారు ఆర్య వైశ్య సంఘం పెడన పట్టణ అధ్యక్షుడు కొల్లూరి సత్యనారాయణ (చిన్నా)కు గౌరవ డాక్టరేట్‌ను ఆదివారం అందజేశారు. సోషల్ సర్వీసుకు సంబంధించి తమిళనాడు రాష్ట్రంలోని హోసూరు ఇండియన్ ఎంపైర్ యూనివర్సిటీలో జరిగిన కార్యక్రమంలో చిన్నా డాక్టరేట్ అందుకున్నారు. 1981 నుంచి 2023 వరకు అనేక ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరాలు ఏర్పాటుచేసి పేదలకు ఉచితంగా శస్త్రచికిత్సలు చేయించడంతోపాటు , మందులను సొంత నిధులతో పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూనివర్సల్ డెవలప్‌మెంట్ కౌన్సిల్ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ప్రభాకర్, వర్కింగ్ ప్రెసిడెంట్ డాక్టర్ కేపీ మనోహరన్, డాక్టర్ ఆకుమల్ల నాని, డాక్టర్ గుణవంత మంజు, డాక్టర్ రవిచంద్రన్, హరిదాసు సుబ్రమణియన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో 'చదువు అంటే మాకు ఇష్టం'



మచిలీపట్నంటౌన్: నగరంలోని ఈడేపల్లి శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదువు అంటే మాకు ఇష్టం కార్యక్రమం నిర్వహించారు. పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు గ్రంథాలయంలోని పుస్తకాలు, దిన పత్రికలు, కథల పుస్తకాలు చదివారు. గ్రంథాలయ పాలకురాలు కోన వెంకటేశ్వరమ్మ విద్యార్థులకు శ్లోకాలు నేర్పించి, నీతి కథలు బోధించారు. ఆటలు ఆడించి కంప్యూటర్ నేర్పించారు.

సచివాలయాల స్పోర్ట్స్ సంఘం రాష్ట్ర కన్వీనర్‌గా బొమ్మిశెట్టి



ప్రభును అభినందిస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

గూడూరు: వార్డు, గ్రామ సచివాలయాల ఉద్యోగుల ఫెడరేషన్ రాష్ట్ర స్పోర్ట్స్ సంఘం కన్వీనర్‌గా జాతీయ క్రీడాకారుడు బొమ్మిశెట్టి ప్రభు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఆదివారం విజయవాడ ఏపీఎన్జీఓ సంఘ కార్యాలయంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎండీ జానీపాషా అధ్యక్షతన జరిగిన కమిటీ సమావేశంలో గూడూరు మండలం కప్పలదొడ్డి గ్రామానికి చెందిన జాతీయ క్రీడాకారుడు ప్రభు ఎన్నిక జరిగింది. ముఖ్య అతిథులుగా పాల్గొన్న ప్రభుత్వ ఉద్యోగుల సంక్షేమ సంఘం సలహాదారు ఎస్. చంద్రశేఖర్‌రెడ్డి, ఏపీఎన్జీఓ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బి. శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి కేవీ శివారెడ్డి బొమ్మిశెట్టిని అభినందించారు.

విత్తనశుద్ధి తప్పనిసరి

మండవల్లి: మండలంలోని అల్లినగరంలో శనివారం డిజిటల్ సీఆర్పీ గౌతమ్‌కుమార్ ఆధ్వర్యంలో ఇంటింటికీ తిరిగి ప్రతి ఇంట్లో బీజామృతంతో విత్తనశుద్ధి నిర్వహించారు. ఈ సందర్భంగా గౌతమ్‌కుమార్ మాట్లాడుతూ విత్తనశుద్ధి చేయడం ద్వారా భూమి నుంచి వ్యాపించే తెగుళ్ల నివారణ, మొలక శాతం అధికంగా రావడానికి అవకాం ఉందని తెలిపారు. ప్రతి రైతు విత్తనశుద్ధి తప్పనిసరిగా చేయాలని సూచించారు. కార్యక్రమంలో మండల ఇన్‌ఛార్జి నాగవిజయ, రైతులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో హనుమాన్ చాలీసా పారాయణం



హనుమాన్ చాలీసా పారాయణంలో పాల్గొన్న భక్తులు

కోడూరు: ఆంజనేయుడి నామస్మరణతో నక్కవానిదారి గ్రామం పులకించింది. గ్రామంలో అవధూతేంద్ర భక్త సమాజం ఆధ్వర్యంలో 216వ సారి హనుమాన్ చాలీసా పారాయణం కార్యక్రమం ఆదివారం అభయాంజనేయుడి దేవాలయం వద్ద నిర్వహించారు. భక్తసమాజం ఆధ్వర్యంలో ఇప్పటి వరకు వివిధ ప్రాంతాల్లో 215 సార్లు హనుమాన్ చాలీసా పారాయణం జరిగింది. తమ భక్తసమాజం సభ్యులతో చాలీసా పారాయణం జరిపించుకున్న వారిని ఆహ్వానించి సత్కరించి స్వామివారి జ్ఞాపికను అందించారు. తొలుత స్వామి వారికి పంచామృతాలతో ప్రత్యేక అభిషేకాలు జరిగాయి. అనంతరం అన్నసమారాధన నిర్వహించారు.

సాగరతీరంలో మెరైన్ పోలీసుల గస్తీ



పర్యాటకులకు సూచనలిస్తున్న మెరైన్ సిబ్బంది

కోడూరు: హంసలదీవి సాగరతీరంలో పాలకాయతిప్ప మెరైన్ పోలీసులు గస్తీ నిర్వహించారు. ఆదివారం సెలవుదినం కావడంతో వివిధ ప్రాంతాలకు చెందిన పర్యాటకులు ప్రత్యేక వాహనాల్లో తీరానికి తరలివచ్చారు. సముద్ర అలల మధ్య కేరింతలు కొడుతూ సందడి చేశారు. పర్యాటకులకు ఏవిధమైన అసౌకర్యం కలుగకుండా మెరైన్ సిబ్బంది గస్తీ చేపట్టారు. యాత్రికులకు సూచనలిస్తూ, సముద్ర పరిస్థితుల గురించి వివరించారు. సీఐ పవన్‌కిషోర్, ఎస్‌ఐ జిలానీ పర్యవేక్షణలో గస్తీ చేపట్టారు.

కృష్ణానదిలో వ్యక్తి గల్లంతు

విజయవాడకు చెందిన ఆముదాల ప్రకాష్‌గా గుర్తింపు

అవనిగడ్డ: మండల పరిధిలోని పులిగడ్డ వద్ద కృష్ణానదిలో విజయవాడ పంజా సెంటర్‌కు చెందిన ఆముదాల ప్రకాష్ (32) గల్లంతైన ఘటన ఆదివారం రాత్రి జరిగింది. ఎస్‌ఐ రమేష్ అందించిన వివరాల ప్రకారం.. విజయవాడకు చెందిన ప్రకాష్, అతని మిత్రుడు మధుసూదన్ వెల్డింగ్ పనులు చేస్తుంటారు. మోపిదేవి వార్పు వద్ద కొత్తగా ఏర్పాటు చేసిన టోల్‌గేట్ వద్ద వెల్డింగ్ పని కుదుర్చుకునేందుకు వచ్చారు. పని గురించి మాట్లాడిన అనంతరం ఇంటికి తిరిగి వెళుతుండగా వార్పు డొంకరోడ్డు వద్దకు రాగానే బైక్‌పై నుంచి ప్రకాష్ అదుపు తప్పి పడిపోయాడు. బట్టలకు బురద అయింది. కడుక్కునేందుకు సమీపంలోని పులిగడ్డ కొత్తబ్రిడ్జి సమీపంలో గతంలో కృష్ణానదిలో ఓఎన్జీసీ వేసిన రహదారిపై తూముల వద్ద కృష్ణానదిలోకి దిగి బట్టలు శుభ్రం చేసుకున్నాడు. అనంతరం ప్రకాష్ స్నానం చేసేందుకు మరోసారి నదిలోకి దిగగా ఆ ప్రాంతంలో ఊబి ఉండటంతో పైకి రాలేక పోయాడు. ఇది గమనించిన మిత్రుడు మధుసూదన్ రహదారిపైకి వచ్చి స్థానికులకు తెలిపాడు. వారు అక్కడకు చేరుకుని వెతికినా ఆచూకీ లభించలేదు. పోలీసులకు సమాచారం ఇవ్వగా ఘటనా స్థలానికి చేరుకున్న ఎస్‌ఐ రమేష్, అగ్నిమాపక సిబ్బంది, గజ ఈతగాళ్లతో లైట్ల సహాయంతో గాలిస్తున్నారు.

నేర స్వభావం వీడి సత్ప్రవర్తనతో మెలగాలి

డీఎస్పీ మురళీధర్



నాగాయలంకలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న డీఎస్పీ మురళీధర్

నాగాయలంక: చెడునడత కలిగినవారు గొడవలకు దూరంగా ఉంటూ సత్ప్రవర్తనతో మెలగాలని అవనిగడ్డ డీఎస్పీ పి.మురళీధర్ అన్నారు. నాగాయలంక పోలీస్ స్టేషన్‌ను శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా మండలంలోని 30 మంది రౌడీ షీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ రౌడీ, సస్పెక్ట్ షీటర్లు వివాదాలు, ఘర్షణలకు దూరంగా ఉండాలన్నారు. గ్రామాల్లో తిరిగేటప్పుడు వివాదాలు కనిపించినా మీలో ఎవరూ అటుపక్కకు కూడా పోవద్దని, గొడవలు వద్దు అని మీరే ప్రజలకు చెప్పడం ద్వారా మీపై సమాజంలో చెడు భావం తొలగిపోతుందన్నారు. నేర స్వభావం గల మహిళలు వాటి నుంచి బయటపడి కుటుంబాలకు చేరువ కావాలని సూచించారు. రౌడీషీటర్లపై పోలీస్ నిఘా ఉంటుందనేది గుర్తించుకోవాలన్నారు. అవనిగడ్డ సీఐ జి.శ్రీనివాసరావు, ఎస్‌ఐ ఎం.సుబ్రహ్మణ్యం, సిబ్బంది పాల్గొన్నారు.

వివాదాలకు దూరంగా ఉండాలి..

కోడూరు: రౌడీషీట్, సస్పెక్ట్ షీట్ కలిగిన వారు చట్ట వ్యతిరేక కార్యకలాపాలు, వివాదాలకు దూరంగా ఉండాలని అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్ అన్నారు. ఆదివారం స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీషీట్, సస్పెక్ట్ షీట్ కలిగిన వారిపై ప్రత్యేక పోలీస్ నిఘా ఉంటుందని, సదరు వ్యక్తులు పనులపై బయటి ప్రాంతాలకు వెళితే తప్పనిసరిగా పోలీస్‌స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. అవనిగడ్డ సీఐ జి.శ్రీనివాస్, ఎస్‌ఐ రాజేంద్రప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

నిరంతరం పోలీసుల నిఘా..

అవనిగడ్డ: రౌడీ, సస్పెక్ట్ షీటర్లపై పోలీసుల నిరంతర నిఘా ఉంటుందని, వీరు వివాదాలకు పోకుండా, చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడకుండా సత్ప్రవర్తనతో మెలగాలని డీఎస్పీ పి. మురళీధర్ అన్నారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో రౌడీషీట్, సస్పెక్ట్ షీట్ ఉన్న వారికి ఆదివారం డీఎస్పీ కౌన్సెలింగ్ నిర్వహించారు. డీఎస్పీ మాట్లాడుతూ రౌడీ, సస్పెక్ట్ షీట్ ఉన్నవారి ప్రతి కదలికను పోలీసులు పర్యవేక్షిస్తుంటారని, చట్టవ్యతిరేక కార్యక్రమాలు, సంఘ విద్రోహ చర్యలకు పాల్పడితే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సీఐ శ్రీనివాస్, రమేష్ పాల్గొన్నారు.

అగ్ని బాధితుడికి ఆర్థిక సాయం అందజేత



బాధితుడికి సహాయం అందిస్తున్న ఎమ్మెల్యే రమేష్‌బాబు

కోడూరు: విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధిత కుటుంబానికి వైఎస్సార్ సీపీ అండగా నిలిచింది. ఉల్లిపాలెం గ్రామానికి చెందిన చాట్రగడ్డ రంగారావు నివాస గృహం అగ్ని ప్రమాదంలో ఇటీవల దగ్ధమైంది. రంగారావు కుటుంబ సభ్యులు కట్టుబట్టలతో మిగిలారు. ఆదివారం ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు బాధిత కుటుంబాన్ని పరామర్శించి ప్రమాద వివరాలు అడిగి తెలుసుకున్నారు. కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, నూతన గృహం మంజూరు చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. అనంతరం మండల వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో సమకూర్చిన రూ. 20 వేల నగదును బాధితుడికి ఎమ్మెల్యే చేతుల మీదగా అందించారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ, జిల్లా రైతు విభాగం కార్యదర్శి కొండవీటి వీర వెంకట నారాయణరావు, ఎంపీటీసీలు బడే గంగాధరరావు, తిమ్మన నాంచాయ్య, పీఏసీఎస్ చైర్‌పర్సన్ కటకం కుటుంబరావు, సచివాలయాల మండల కన్వీనర్ కడవకొల్లు శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ కన్వీనర్ వెన్నా ప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే పరామర్శ..

కోడూరు: ఉల్లిపాలెం గ్రామానికి చెందిన సిద్దినేని అన్నపూర్ణ, కొక్కిలిగడ్డ అంకమ్మ, చీరాల రమేష్, గురువిందపల్లి దేనారావులు వివిధ కారణాలతో ఇటీవల మృతిచెందారు. ఎమ్మెల్యే రమేష్‌బాబు మృతుల కుటుంబ సభ్యులను ఆదివారం పరామర్శించారు. మృతుల చిత్రపటాల వద్ద నివాళులర్పించారు. జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకటసత్యనారాయణ, పార్టీ రైతు విభాగం కార్యదర్శి కొండవీటి నారాయణరావు, పీఏసీఎస్ చైర్‌పర్సన్ కటకం కుటుంబరావు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓర్వలేకే ఆరోపణలు

టీడీపీ నేతల తీరుపై వైఎస్సార్ సీపీ నేతల ఆగ్రహం



విలేకరులతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నేతలు

కోడూరు: నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధిని చూసి ఓర్వలేక తెలుగుదేశం పార్టీ నేతలు కావాలనే అవనిగడ్డ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబుపై చౌకబారు విమర్శలు చేస్తున్నారని జెడ్పీటీసీ యాదవరెడ్డి వెంకట సత్యనారాయణ అన్నారు. ఆదివారం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద మండల నాయకులు విలేకరులతో మాట్లాడారు. టీడీపీ అధికారంలో ఉండగా పేద వారికి సంక్షేమ పథకాలు ఇచ్చేందుకు జన్మభూమి కమిటీల పేరుతో అయినకాడికి దండుకున్న పరిస్థితిని ప్రజలు మర్చిపోరని సత్యనారాయణ అన్నారు. నీరు–చెట్టు పథకం పేరుతో చెరువుల్లోని మట్టిని టీడీపీ నేతలు అమ్ముకున్నారని చెప్పారు. కరోనా వంటి విపత్కర పరిస్థితుల్లో కనబడని టీడీపీ నేతలు ఎన్నికలు సమీపిస్తుండటంతో ధర్నాలు, నిరసనల పేరుతో హడావుడి చేయడం పరిపాటిగా మారిపోయిందని విమర్శించారు. రైతు విభాగం జిల్లా కార్యదర్శి కొండవీటి నారాయణరావు మాట్లాడుతూ జూన్ నెల ముగుస్తున్నా కూడా కాలువలకు సాగునీరు ఇవ్వలేదంటూ మండలి బుద్ధప్రసాద్ మాట్లాడడం హాస్యాస్పదమన్నారు. సాగునీటిని ప్రణాళిక ప్రకారం విడుదల చేస్తారని, ఇది కూడా తెలియకుండా బుద్ధప్రసాద్ ఎలా మాట్లాడుతున్నారని ప్రశ్నించారు. ప్రజలు అన్ని విషయాలను గమనిస్తున్నారని, ఈసారి కూడా మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గెలవడం ఖాయమని చెప్పారు. ఎంపీటీసీలు బడే గంగాధరరావు, తిమ్మన నాంచారయ్య, సచివాలయాల మండల కన్వీనర్ కడవకొల్లు శ్రీనివాసరావు, ఎస్సీ సెల్ కన్వీనర్ వెన్నా ప్రసాద్, బీసీ సంఘం మండల అధ్యక్షుడు లంకే రవి తదితరులు పాల్గొన్నారు.

బియ్యం, నిత్యావసరాలు పంపిణీ



చీరలు అందజేస్తున్న వాసవీ క్లబ్ ప్రతినిధులు

మచిలీపట్నంటౌన్: వాసవీ క్లబ్ ఇంటర్నేషనల్ అనుబంధ వనిత క్లబ్, కపుల్ క్లబ్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం సేవా కార్యక్రమాలు నిర్వహించారు. సంఘ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పేద రైతులకు పారా, పలుగు, పేద ఆర్యవైశ్య కుటుంబాల వారికి 25 కిలోల బియ్యం, నిత్యావసర సరుకులు, 10 మంది వృద్ధులకు చీరలు పంపిణీ చేశారు. గొడుగుపేటలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులు కూర్చునేందుకు సిమెంటు బెంచీని అందజేశారు. క్లబ్ ఇంటర్నేషనల్ ప్రతినిధులు బొమ్మిడి లక్ష్మీకుమారి, రంగారావు, గవర్నర్ మాజేటి రామచంద్ర, వైస్ గవర్నర్ కొత్త గణేష్, కేబినెట్ సెక్రటరీ ప్రభాకర్, క్లబ్ ప్రతినిధులు పాల్గొన్నారు.

కారు ఢీకొని దంపతులకు గాయాలు

గూడూరు: మచిలీపట్నం–విజయవాడ జాతీయ రహదారిపై ఆదివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులు గాయపడ్డారు. ఈ ఘటన గూడూరు సెంటర్‌లో చోటుచేసుకుంది. వివరాల ప్రకారం.. కప్పలదొడ్డికి చెందిన కేశిరెడ్డి విఘ్నేశ్వరరావు భార్య పైడమ్మతో కలిసి ద్విచక్ర వాహనంపై గూడూరు మండలం ఐదుగుల్లపల్లిలోని తన కుమార్తె ఇంటికి వెళ్లారు. తిరిగి స్వగ్రామానికి ఆదివారం సాయంత్రం బయలుదేరారు. గూడూరు సెంటర్లో కప్పలదొడ్డివైపు తన ద్విచక్ర వాహనాన్ని మలుపు తిప్పుతుండగా మచిలీపట్నం నుండి విజయవాడ వెళుతున్న కారు ఢీకొట్టింది. తీవ్రంగా గాయపడిన పైడమ్మ అపస్మారక స్థితిలోకి వెళ్లగా విఘ్నేశ్వరరావు కాలికి గాయాలయ్యాయి. బాధితులను 108 వాహనంలో బందరు ప్రభుత్వాస్పత్రికి తరలించి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.